


sahanamvande.com
epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 26-10-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 179 EDITOR: ROHINI




# ఆపరేషన్లంటే డాక్టర్ల పరేషాన్

## సర్జరీ కోర్సులుంటే విద్యార్థుల్లో వణుకు



- కత్తి పట్టాలంటే వణుకుతున్న చేతులు
- ఆపరేషన్ వికటిస్తే... చనిపోతే పట్టించుకునే నాథుడెవరు?
- జనరల్ మెడిసిన్, రేడియాలజీ, డెర్మటాలజీ వైపు మొగ్గు
- నీట్ పీజీ కౌన్సిలింగ్‌లో వింత ధోరణులు
- సర్జరీ వైపు తగ్గిన ఆసక్తి... వైద్య రంగంలో మారుతున్న ట్రెండ్
- యువ డాక్టర్ల కొత్త జీవన విధానం... భవిష్యత్తులో సర్జన్ల కొరత



**వైద్య వృత్తి అంటేనే నిస్వార్థ సేవకు, ప్రాణాలు కాపాడే సాహసానికి ప్రతీక. అర్ధరాత్రి ఒంటి గంటయినా, రెండు గంటలైనా ప్రాణాలతో కొట్టుమిట్టాడే రోగిని బతికించడానికి డాక్టర్లు పరుగులు పెడుతుంటారు. కానీ అలాంటి డాక్టర్లే ఇప్పుడు కెరీర్ మార్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందంటే నమ్మగలరా? తాజాగా నీట్ పీజీ మొదటి కౌన్సిలింగ్‌కు సంబంధించి వెలువడిన టాప్ 100 ఛాయిస్‌ల గణాంకాలు వైద్య రంగంలో ఒక సంచలన మార్పును కళ్లకు కడుతున్నాయి. టాపర్లు అందరూ సర్జరీల వైపు వెళ్లడం మానేసి వేరే దారి చూసుకుంటున్నారు. అసలు డాక్టర్లకు ఏమైంది? వారు ఎందుకు భయపడుతున్నారు? దీనివల్ల మనకు రాబోయే ప్రమాదం ఏమిటో ఇప్పుడు చూద్దాం.**

**- సహనం వందే, హైదరాబాద్**

డాక్టర్ ఎలా తయారవుతాడు? ఎంతో కష్టపడి చదివి, నీట్-పీజీ పరీక్షలో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమకు నచ్చిన బ్రాంచ్‌ను ఎంచుకుంటారు. తాజాగా నీట్ పీజీ మొదటి కౌన్సిలింగ్‌కు సంబంధించి వచ్చిన టాప్ 100 ఛాయిస్‌ల గణాంకాలు అందరినీ విస్మయా నికి గురి చేస్తున్నాయి. ఇందులో అత్యధికంగా 52 మంది మెడిసిన్‌ను ఎంచుకోగా, 23 మంది రేడియాలజీ వైపు, 11మంది డెర్మటాలజీ వైపు మొగ్గుచూపారు. సర్జరీ వైపు వెళ్లేవారి సంఖ్య భారీగా తగ్గిపోవడం వైద్య రంగంలో ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది.

### ఆపరేషన్ వికటిస్తే... రోగి చనిపోతే?

అసలు ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణం ఏంటో సామాన్యులు కూడా ఆలోచించాలి. కేవలం పాషన్, డబ్బు, లగ్జరీ లైఫ్‌స్టైల్, సూపర్ స్పెషలైజేషన్ మాత్రమే కాదు...ఈరోజు ఒక యువ డాక్టర్ ఏమని ఆలోచిస్తున్నాడంటే... 'నేను రాత్రి రెండు గంటలైనా సరే రోగి ప్రాణాలు కాపాడటానికి సిద్ధమే, కానీ ఆపరేషన్ వికటిస్తే లేదా రోగి చనిపోతే నాకు రక్షణ ఎవరు ఇస్తారు?' అని ప్రశ్నిస్తున్నాడు. ఈ ఒక్క భయమే ఈరోజు వైద్య రంగంలో పెను మార్పులకు కారణమవుతోంది.

### సర్జరీ వెనుక ఉన్న కఠిన వాస్తవాలు

సర్జరీ అనగానే మనకు కత్తి పట్టుకుని ప్రాణాలు కాపాడే దృశ్యం గుర్తుకొస్తుంది. కానీ దాని వెనుక ఎంత కష్టం ఉంటుందో ఎవరైనా ఆలోచించారా? సంవత్సరాల తరబడి సాగే కఠినమైన శిక్షణ, నిద్ర లేని రాత్రులు,కంటి మీద కునుకు లేని డ్యూటీలు ఉంటాయి. వీటికి తోడు కుటుంబానికి దూరంగా గడపాల్సి వస్తుంది. ఇవన్నీ ఒకెత్తైతే, ఆసుపత్రిలో అడుగుపెట్టిన క్షణం నుంచి మొదలయ్యే మానసిక వేధింపులు ఆ యువ డాక్టర్లను కుంగదీస్తున్నాయి.

### చట్టపరమైన ఒత్తిళ్లు... భద్రతా సమస్యలు

అన్నింటికంటే ముఖ్యంగా ఈరోజు డాక్టర్లను భయపెడుతున్న ప్రధాన సమస్య చట్టపరమైన ఒత్తిళ్లు. ఆపరేషన్ టేబుల్ మీద డాక్టర్ తన సర్వశక్తులు ఒడ్డుతాడు.. ప్రాణం పోయాలని ప్రయత్నిస్తాడు. కానీ కొన్నిసార్లు మన చేతుల్లో ఏదీ ఉండదు, ప్రాణం పోతుంది. అలా జరిగిన ప్రతిసారీ, డాక్టరే తప్పు చేశాడని దాడులు చేయడం ఈరోజు సాధారణమైపోయింది. రక్షణ లేని ఆ వాతావరణంలో ఎవరైనా సరే రిస్క్ తీసుకుని సర్జరీ చేయడానికి ముందుకు వస్తారా? వైద్య రంగం అనేది ఏమాత్రం కంఫర్ట్ ఉండే జాబ్ కాదు. ఇది క్షణక్షణమూ టెన్షన్‌తో కూడుకున్న బాధ్యతాయుతమైన ప్రయాణం. కానీ ప్రతి విషమ పరిస్థితిని ఒక క్రిమినల్ నేరంగా చూడడం సరైన పద్ధతా? ఒక మనిషి చనిపోతే దాన్ని వైద్యుడి హత్యగా చిత్రీకరించే ధోరణి పెరిగిపోయింది. ఇలాంటి వాతావరణం ఉంటే ఏ యువ డాక్టర్ కూడా కత్తి పట్టుకోవడానికి సాహసించలేడు.

### మెడిసిన్, రేడియాలజీల వైపు మొగ్గు

అందుకే టాపర్లు అందరూ ఆ రిస్క్ ఉండే సర్జికల్ విభాగాలను పక్కన పెడుతున్నారు. దానివల్ల ఇప్పుడు మెడిసిన్, రేడియాలజీ వంటి విభాగాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే సర్జరీతో పోలిస్తే అక్కడ ఒత్తిడి తక్కువగా ఉంటుందని వారు భావిస్తున్నారు. కానీ ఇది కేవలం డాక్టర్ల సమస్య మాత్రమే కాదు, రేపు పొద్దున మన కుటుంబంలో ఎవరికైనా అత్యవసర ఆపరేషన్ వస్తే పరిస్థితి ఏంటనేది మనం ఆలోచించాలి.మఎం డాక్టర్ తయారవడానికి పది ఏళ్ల చదువు, కఠినమైన శ్రమ ఉంటాయి. అలాంటి ప్రతిభావంతులను మనం గౌరవించగౌరవించుకోవాలి. వైద్యుడిని అనుమానిస్తూ, ప్రతిసారీ నేరస్తుడిలా చూసే సంస్కృతి మారాలి. అప్పుడే ఆపరేషన్ థియేటర్లలో మళ్లీ ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. లేదంటే ప్రాణాలు కాపాడే చేతులే భయంతో వణికిపోయి వెనకడుగు వేసే పరిస్థితి వస్తుంది.

# విమాన ప్రయాణికులకు ట్యాక్స్ రిఫండ్

## టికెట్ల క్యాన్సిలేషన్‌పై జీఎస్టీ వాపస్

## ప్రయాణికులకు అనుకూల తీర్పు

**ఎప్పుడైనా అనుకోకుండా ఫ్లైట్ టికెట్ క్యాన్సిల్ చేసుకున్నారా? అయితే ఈ వార్త కచ్చితంగా మీకోసమే! క్యాన్సిలేషన్ చార్జీల పేరుతో సగం డబ్బులు గుంజడమే కాకుండా, మనం చెల్లించిన జీఎస్టీని కూడా ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇప్పటివరకు తమ జేబులో వేసుకునేవి. కానీ ఇకపై ఆ దందాలకు చెక్ పడనుంది.**

**- సహనం వందే, హైదరాబాద్**




విమాన టికెట్ క్యాన్సిల్ చేసుకున్నప్పుడు మనం చెల్లించిన జీఎస్టీ ట్యాక్స్ డబ్బులు మళ్లీ మనకు తిరిగొస్తాయా లేదా అన్న సందేహాలకు జీఎస్టీ అప్పెలేట్ ట్రిబ్యునల్ స్పష్టత ఇచ్చింది. ప్రయాణికులకు టికెట్ రద్దు మొత్తంతో పాటు పన్ను డబ్బులను కూడా పూర్తి స్థాయిలో వాపస్ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. అలా ప్రయాణికులకు వాపస్ ఇచ్చిన పన్ను మొత్తాన్ని ఎయిర్‌లైన్స్ సంస్థలు ప్రభుత్వం నుంచి రిఫండ్ పొందవచ్చని స్పష్టం చేసింది.

### సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఉదాహరణ

ఈ వ్యవహారంలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఉదాహరణే కీలకమైనది. ఆ సంస్థకు సంబంధించిన ఒక కేసును పరిశీలించిన జీఎస్టీ అప్పెలేట్ ట్రిబ్యునల్ ఈ ఆదేశాలు ఇచ్చింది. టికెట్లు రద్దు చేసుకున్న వారికి చట్టప్రకారం చెల్లించాల్సిన డబ్బులను వెనక్కి ఇచ్చినందున, పన్ను శాఖ నుంచి జీఎస్టీ వాపస్ పొందడానికి ఆ సంస్థ అర్హులని తేల్చిచెప్పింది. ఇది దేశంలోని మిగతా విమానయాన సంస్థలకు కూడా కనువిప్పు లాంటిది.

### 45 లక్షలకు పైగా వాపస్

సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు చెందాల్సిన దాదాపు 45 లక్షల 92 వేల రూపాయల జీఎస్టీ మొత్తాన్ని, దానికి తగిన వడ్డీతో సహా వెంటనే తిరిగి చెల్లించాలని పన్ను శాఖను ట్రిబ్యునల్ ఆదేశించింది. దీంతో ఈ వార్త దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. విమాన ప్రయాణాలను రద్దు చేసుకున్నప్పుడు డబ్బులు పోతాయని టెన్షన్ పడాల్సిన అవసరం ఇకపై ఉండదు. మనం చెల్లించిన పన్నులు కూడా తిరిగి మన జేబులోకి వచ్చేలా ఈ తీర్పు మార్గం సుగమం చేసింది.

### పారదర్శకత వైపు అడుగులు

అన్ని ప్రధాన విమానయాన సంస్థలు తమ క్యాన్సిలేషన్ రూల్స్‌ను మళ్లీ సరిచూసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఏవైనా సంస్థలు పన్ను వాపసు ఇవ్వడానికి తిరస్కరిస్తే, ప్రయాణికులు ఈ తీర్పు ఆధారంగా లీగల్‌గా పోరాడవచ్చు.

ఇది వినియోగదారుల హక్కుల పరిరక్షణలో మరో అడుగు ముందుకు పడినట్టే.

# మిల్లర్ల దందాపై సీఐడీ పంజా

## తెలంగాణలో సన్న బియ్యం స్కామ్

- రంగంలోకి సీఐడీ.. 14 మంది అరెస్ట్!
- సన్న రకం గోల్మాల్... భారీగా నిధుల బదిలీ
- రూ.242 కోట్ల గండి... ముమ్మర తనిఖీలు
- కొందరు అధికారుల పాత్ర పైన అనుమానాలు



**తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్లుల యజమానులు చేసిన పెద్ద దగా ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి అందజేయాల్సిన సన్న రకం బియ్యం స్థానంలో చౌకబారు దొడ్డు రకం బియ్యాన్ని సరఫరా చేసి ప్రభుత్వ ఖజానాకు విపరీతమైన నష్టం కలిగించారనే ఆరోపణలు బయటపడ్డాయి. ఈ మొత్తం వ్యవహారంపై తెలంగాణ సీఐడీ రంగంలోకి దిగి లోతైన దర్యాప్తు ప్రారంభించింది. - సహనం వందే, హైదరాబాద్**

ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ఏకంగా 71.86 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించింది. ఇందులో భాగంగా 59.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లింగ్ చేసి ఎఫ్సీఐకి అందజేయాల్సి ఉంది. అయితే కొందరు కేటుగాళ్లైన రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి ఇచ్చిన మాటను తప్పారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన నాణ్యమైన సన్న రకం వరిని బయటి మార్కెట్లో ఎక్కువ ధరలకు అమ్ముకున్నారు. ఆ స్థానంలో బయట రాష్ట్రాల నుంచి చౌకగా దొరికే దొడ్డు రకం బియ్యాన్ని తెప్పించి ప్రభుత్వానికి కస్టమ్ మిల్డ్ రైస్ కింద సరఫరా చేశారనే సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి.

### విచారణలో బయటపడిన దగా...

టాస్క్ ఫోర్స్ బృందాలు రైస్ మిల్లులపై నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఈ అక్రమాలు రట్టయ్యాయి. ల్యాబ్‌లలో ఈ బియ్యం నమూనాలను విశ్లేషించగా, వారు పంపిన బియ్యం ఏమాత్రం నిర్దేశించిన సన్న రకం ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. ప్రధానంగా నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న రకం బియ్యానికి బదులుగా 3,385 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం బియ్యాన్ని సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనివల్ల కేవలం బోనస్ రూపంలోనే ప్రభుత్వానికి రూ. 1.69 కోట్ల మేర నష్టం వాటిల్లింది.

### రూ. 242 కోట్ల భారీ నష్టానికి కుట్ర

ఇది కేవలం కొద్ది మొత్తానికే పరిమితం కాలేదు. కన్వర్షన్ పేరుతో మరో 45,414 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మార్చేందుకు కుట్ర పన్నినట్లు తేలింది. ఒకవేళ ఈ ప్రక్రియ పూర్తయి ఉంటే బోనస్ రూపంలోనే ప్రభుత్వానికి సుమారు రూ. 242 కోట్ల భారీ ఆర్థిక గండి పడేదని అధికారులు ప్రాథమికంగా లెక్కించారు. అయితే పౌర సరఫరాల శాఖ అధికారులు సకాలంలో స్పందించి, ఆ ప్రక్రియను నిలిపివేయడం వల్ల జరగబోయే పెద్ద ప్రమాదం తప్పిందని సీఐడీ వెల్లడించింది.

### మూడు క్రిమినల్ కేసులు... 14 మంది అరెస్ట్

సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఈ నెల 24న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ విచారణను వేగవంతం చేసింది. నిబంధనల ఉల్లంఘన, నమ్మకద్రోహం, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా కుట్ర పన్నడం లాంటి తీవ్రమైన ఆరోపణలపై మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసింది. ఈ అక్రమాలకు పాల్పడిన 14 మంది రైస్ మిల్లర్లను సీఐడీ అధికారులు ఇప్పటికే అరెస్ట్ చేశారు.

### విచారణ... పరిణామాలు

ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి అన్ని డాక్యుమెంటరీ, ఆధారాలను సీఐడీ బృందాలు సేకరిస్తున్నాయి. మిల్లుల యజమానులతో పాటు వారికి సహకరించిన అధికారులు లేదా ఇతరుల ప్రమేయం ఏదైనా ఉందా అనే కోణంలో లోతుగా ఆరా తీస్తున్నారు. అసలు ఎంత నష్టం వాటిల్లింది, కేటాయింపులు ఎలా జరిగాయి, మళ్లింపుల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు అనే విషయాన్ని తేల్చేందుకు సీఐడీ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.